



# వడ్లు కొన్నది లేదు.. మిల్లులకు తరలించేది లేదు...

## పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల ప్రతినిధి :**

మంచిర్యాల జిల్లాలో 2024-25 యాసంగి సీజన్ ధాన్యం సేకరణకు సంబంధిత శాఖ అధికారులు అంతా సిద్ధం చేశామని ప్రకటనలు చేసుకుంటున్నారు తప్పా అవి క్షేత్ర స్థాయిలో ఏ మాత్రం ఫలితాలివ్వడం లేదు. జిల్లా వ్యాప్తంగా 95 వేల 344 ఎకరాల సాధారణ సాగు కాగా 1,21,702 (దొడ్డు రకం 1,14,774, సన్న రకం 6,928 ) ఎకరాలలో వరి సాగయింది. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల 30 వేల 440 (దొడ్డు రకం 3,13, 778, సన్న రకం 16,662) మెట్రిక్ టన్నులు వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంఛనా వేశారు. జిల్లాలో కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి చేరుతోంది.

**జిల్లాలో మూడు ఏజెన్సీలు.. 321 కేంద్రాలు...**

జిల్లాలోని రైతులు వరి పంట సాగు చేసి వారి అవసరాల కోసం 9,860 మెట్రిక్ టన్నుల వరకు వాడుకోవడం లాంటివి మినహాయిస్తే కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల 30 వేల 440 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంఛనా వేశారు. ఈ ధాన్యాన్ని మూడు ఏజెన్సీల పరిధిలోని 321 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో డీఆర్డీఏ (ఐకేపీ) ఏజెన్సీకి 194 , పీఏసీఎస్ కు 121, మెప్మా ఏజెన్సీకి 6 సెంటర్లను కేటాయించారు. వీటి ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

**పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు...**

జిల్లాలో 321 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. కాని అవి పేరుకు మాత్రమే కొనుగోలు కేంద్రాలుగా చెలామణి అవుతున్నాయి తప్ప క్షేత్ర స్థాయిలో కొనుగోళ్లు జరుగడం లేదు. ఓవైపు మబ్బులు వస్తుండటం, అక్కడక్కడ జల్లులు పడుతుండటం.., మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు లబోదిబో మంటున్నారు... జిల్లాలో దాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు నేరుగా సంబంధిత శాఖ అధికారులకే ఫిర్యాదులు చేస్తున్నారు.

**కొన్నది లేదు.. మిల్లులకు తరలించేది లేదు...**

హాజీపూర్ మండలం కర్ణ మామిడి, హాజీపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంతవరకు ప్రారంభించలేదు. పేపర్లలో వార్తలు వచ్చిన వెంటనే హడావిడి చేస్తున్న అధికారులు రైతులకు ఏమాత్రం ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవడం లేదు. రైతులు నేరుగా జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత వరకు ఈ కేంద్రాల నుంచి ధాన్యం కొన్నది లేదు.., మిల్లులకు తరలించినది లేదు...



- కోత లేకుండా మిల్లుల్లో దిగడం కష్టమే...
- రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమే...

**కోత లేకుండా మిల్లుల్లో దిగడం కష్టమే...**

ఇటీవల గుడిపేట, నంనూరు ఐకేపీ కేంద్రాల నుంచి నాలుగు లారీల ధాన్యం అందుగుల పేటలోని ఒక మిల్లుకు పంపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా లారీకి పాతిక నుంచి 25 బస్తాల కోత లేకుండా దించేది లేదని నాలుగు రోజులు మిల్లు వద్దనే లారీలను ఆపి వేశారు. ఒక వైపు లారీల యాజమానులు అన్ లోడ్ చేయించాలని రైతులపై ఒత్తిడి చేయడం, మరోవైపు సెంటర్ నిర్వాహకులు రైతులను కోతకు ఒప్పుకోవాలని ఒత్తిడి చేయడంతో చేసేదేమి లేక రైతులు కోతకు ఒప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడే బస్తాకు రెండు కిలోలు కోత విధిస్తుంటే రానున్న రోజుల్లో క్వింటాలుకు 15 నుంచి 20 కిలోలు కోత విధించే అవకాశాలున్నాయని, అధికారులు మిల్లర్లకు వత్తాసుపలకకుండా రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు...**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని చెబుతున్న అధికారులు క్షేత్ర స్థాయిలో అవి ఏమేరకు జరుగుతున్నాయో పరిశీలించడంలో పూర్తిగా విఫలమ య్యారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశిస్తున్నా అవి ఏమాత్రం అమలు కావడం లేదు. దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నా రు. కొంత మంది రైతులు చేసేదేమి లేక తక్కువ ధరకు సమీప మిల్లులకు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## యాసంగి ధాన్యం కొనుగోలుపై మంత్రి సమీక్ష

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి ధాన్యం వేగంగా కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆయన పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రమైందని, యాసంగి సీజన్‌లో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉందన్నారు. వానాకాలంలో విజయవంతంగా ధాన్యం కొనుగోలు నిర్వహించిన కలెక్టర్లు, అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. యాసంగిలో అదనంగా 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అవసరం ఉందన్నారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేర్లపై ఎటువంటి కోతలు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఐకెపి, ప్యాక్స్ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. మౌలిక వసతులు లేని చోట కలెక్టర్లు వాటిని కొనుగోలు చేయవచ్చన్నారు. భారత ఆహార సంస్థ మార్గదర్శకాలను పాటిస్తూ నూకల శాతం 25% మించకూడదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా తక్కువకు ధాన్యం అమ్మకూడదని సూచించారు. సన్న బియ్యం పంపిణీపై మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం 84% జనాభాకు ఉచితంగా సరఫరా చేస్తున్నామని, ప్రజలు ఆనందంగా స్వీకరిస్తున్నారని తెలిపారు. 13 వేల కోట్ల వ్యయంతో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. నాణ్యతపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని అధికారులు ఖండించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ 2.66 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 5.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉందని, 328 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు జరుగుతోందని తెలిపారు.

## నకిలీ విత్తనాలపై పోలీసుల దాడులు



- లభ్యం కాలేదు కానీ.. హెచ్చరికలు జారీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలంలో నకిలీ విత్తనాల వ్యవహారంపై పోలీసులు గట్టిగా కళ్లు పెట్టారు. శనివారం సూర్జాపూర్ గ్రామంలో ఎస్సై గంగారాం నేతృత్వంలో పోలీసులు ఇంటింటి తనిఖీలు జరిపారు. నకిలీ విత్తనాలున్నాయన్న సమాచారంతో ఈ సోదాలు చేపట్టినా, ఎలాంటి నకిలీ విత్తనాలు మాత్రం దొరకలేదు. నకిలీ విత్తనాల వినియోగం వల్ల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతారని పోలీసులు స్పష్టం చేశారు. భూమి సారవంతం దెబ్బతిని, పంట దిగుబడి తగ్గే ప్రమాదముందని హెచ్చరించారు. గ్లైఫోసేట్ వంటివి వాడితే చర్మ వ్యాధులు రావచ్చని, పర్యావరణానికి కూడా హాని జరుగుతుందని వివరించారు. నకిలీ విత్తనాల అమ్మకం, కొనుగోలు చేసినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇలా జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే పోలీసు

# భూభారతి చట్టంతో రైతులకు భూములపై పూర్తి భరోసా





**శెనార్తి మీడియా, హుజూరాబాద్ (కరీంనగర్)**

రైతుల భూములకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం హుజూరాబాద్‌లోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధరణి వ్యవస్థలో పరిష్కారమయ్యే సమస్యలపై భూభారతి చట్టం స్పష్టతను తీసుకురుందని తెలిపారు. గతంలో తహసిల్దారు పరిష్కరించగలిగే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ స్థాయికి చేరుతుండడంతో, పరిష్కారంలో జాప్యం అవుతోందని చెప్పారు. భూభారతిలో అధికార బాధ్యతలను కింది స్థాయికి పంపడంతో, మండల స్థాయిలోనే సమస్యలు త్వరగా పరిష్కరించే అవకాశం లభిస్తోందన్నారు. ధరణి

**కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**



పోర్టల్‌లో దరఖాస్తుల కోసం 33 మాడ్యూల్స్ ఉండగా, భూభారతిలో కేవలం 4 మాడ్యూల్స్‌తో సులభమైన దరఖాస్తు ప్రక్రియను అందుబాటులోకి తెచ్చారని వివరించారు. ధరణిలో సవరణలకు కింది స్థాయి అధికారులకు అధికారాలు లేని కారణంగా వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ లో ఉండేవని, ప్రస్తుతం అధికార విభజన వల్ల సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో అధికారుల ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే, భూభారతి చట్టం కింద అప్పీల్ చేసే అవకాశాన్ని కల్పించడం ఈ చట్టం ప్రత్యేకత అని చెప్పారు. ఇది సివిల్ కోర్టులపై ఆధారపడాల్సిన అవసరాన్ని తక్కువ చేస్తుందని పేర్కొన్నారు.

హుజూరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ భూభారతి చట్టంలోని సెక్షన్లు, మరియు మూడు స్థాయిల అప్పీల్ వ్యవస్థ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

ఈ అవగాహన సదస్సులో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, తహసిల్దార్ కనకయ్యతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా కరీంనగర్ టు వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ టు వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ 20వ వార్షికోత్సవం కరీంనగర్ బైపాస్ రోడ్డు లోని "మన మెకానిక్ భవన్"లో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం అధ్యక్షుడు తిప్పర్తి శ్రీనివాసా చారి నేతృత్వంలో మెకానిక్‌లు బైక్ ర్యాలీగా సభా వేదికకు చేరుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, లేబర్ ఆఫీసర్ హరిఫ్, కాంగ్రెస్ నేత పురమల్ల శ్రీనివాస్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గజ్జల స్వామి పాల్గొన్నారు. సంఘం అధ్యక్షుడు మాట్లాడు తూ గత 20 ఏళ్లలో అనేక సమస్యలు ఎదురైనా మెకానిక్ సోదరుల ఐక్యతతో పరిష్కరించుకున్నామని, యూనియన్ ను బలోపేతం చేసుకున్నామని తెలిపారు. బీఎస్- 4 బైక్స్ నుంచీ బీఎస్ -6 వరకు పరిజ్ఞానం పెంచుకుం టూ ఈ రంగంలో విజయాలు సాధిస్తున్న మెకానిక్స్‌ను అభినందించారు. ముఖ్య అతిథులు మాట్లాడు తూ కార్మికులు లేబర్ కార్డు, ఈ-శ్రమ్ కార్డు చేసుకోవాలని, ప్రమాదవశాత్తు గాయపడిన సందర్భంలో ఈ ఇన్సూరెన్స్‌లు కుటుంబానికి మద్దతు గా నిలుస్తాయని సూచించారు. ఈ సంద ర్భంగా ధర్మారం ప్రాంతానికి చెందిన గాయపడిన మెకానిక్‌కు సంఘం తరపున ఆర్థిక సహాయం అందజేశారు. వేదిక వద్ద టు వీలర్ కంపెనీల స్టాల్స్, ప్రత్యేక టూల్స్ ప్రదర్శన ఆకర్షణగా నిలిచాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో

